సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023




కలలు చెదిరి.. కన్నీరే మిగిలి..
ఇంజినీర్ అయి కుటుంబాన్ని బాగా చూసుకోవాలని ఒకరు.. వ్యాపారంలో తోడుగా ఉండాలని మరొకరు.. బాగా చదువుకుని అండగా ఉండాలని ఇంకొకరు కలలు కన్నారు. -8లో ▸



వెండికిరీటం సమర్పణ
పెదపూడి: జి.మామిడాడలోని సూర్యనారాయణ పురంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి కర్రి కనకదుర్గారెడ్డి కుటుంబ సభ్యులు శనివారం రెండు కిలోల వెండి కిరీటం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2030, మధ్య డెల్టాకు 1325, పశ్చిమ డెల్టాకు 3540 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 7.80 అడుగులకు నీటి మట్టం చేరింది.



పాదగయ : నందీశ్వరా నమోస్తుతే



రాజమహేంద్రవరంలో పుష్కరఘాట్ వద్ద భక్తుల పుణ్యస్నానాలు



రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవు వద్ద భక్తుల కోలాహలం



శివోహం — భక్తజన ప్రవాహం

- జిల్లాలో మారుమోగిన శివనామ స్మరణ
- తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి
- కిటకిటలాడిన శివాలయాలు
- గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరణ
- అడుగడుగునా దాతల వితరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం జిల్లాలోని శైవ క్షేత్రాలు జనసంద్రంగా మారాయి. శివాలయాలు కిటకిటలాడాయి. 22 ఏళ్ల తరువాత శనిత్రయోదశి(శనివారం), మాస శివరాత్రి, మహా శివరాత్రి ఒకే రోజు వచ్చాయి. దీంతో మునుపెన్నడు లేని విధంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి తీరం శివనామస్మరణతో మారుమోగిపోయింది. వేకువజామునుంచే శివాలయాల్లో భక్తులు పరమేశ్వరుని దర్శనం కోసం పోటెత్తారు. రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్, కోటిలింగాలఘాట్, సరస్వతి ఘాట్, వీఐపీ ఘాట్‌లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానమాచరించి పరమేశ్వరుడు దర్శనానికి భక్తులు పోటీపడ్డారు. శ్రీభువనేశ్వరీ సహిత ఉమా కోటిలింగేశ్వర స్వామి, శ్రీ సారంగధరేశ్వర స్వామి వారి ఆలయం, శృంగేరి జగద్గురు శంకరమఠం, శారద పీఠంలోని శ్రీచంద్రమౌళేశ్వర స్పటిక లింగం, క్వారీ మార్కెట్ సెంటర్‌లో గుడి కోరిగా పిలిచే శివాలయం, జాంపేటలోని శ్రీఉమా రామలింగేశ్వర దేవాలయం, మహాకాళేశ్వరాలయం (ఉజ్జయిని ఆలయం) తదితర చోట్ల భక్తులు పరమ శివుని దర్శించుకున్నారు.

ఆలయాల్లో విశేష పూజలు

తెల్లవారు జామునే అన్ని ఆలయాలకు భక్తుల తాకిడి మొదలైంది. ముఖ్య ఆలయాల్లో వేలాదిగా భక్తులు కనిపించారు. పుణ్యస్నానాలు ఆచరించి శివయ్య దర్శనం కోసం బారులు తీరారు. అన్ని ఆలయాల్లోనూ లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిళ్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సర్వదర్శనం కొనసాగించారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. భక్తుల సంఖ్య పెరిగినా ప్రశాంతంగా దర్శనం జరిగింది. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. రాజమహేంద్రవరంలోని అన్ని ప్రాంతాల్లో భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు తరించాయి. వివిధ ఆహార పదార్థాలను పంపిణీ చేశాయి. మజ్జిగ, **పులిహోర, వెజిటబుల్ పలావు, రస్నా, పుచ్చకాయలు, కూల్‌డ్రింక్స్, ప్రసాదం భక్తులకు పంపిణీ చేశాయి.**

పంచారామ క్షేత్రానికి తాకిడి

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారారామభీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి రావడం ప్రారంభించారు. అర్ధ రాత్రి దాటాక 12.15 నిమిషాలకు నిర్వహించిన స్వా మి వారి తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి భక్తులు పోటీ పడ్డారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలి పూజా కార్యక్రమాన్ని వేద పండితు లు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనానికి అనుమతి ఇచ్చారు.

తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు సుమారు లక్ష మంది దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

భక్తజన సంద్రంమైన గోష్పాదక్షేత్రం

కొవ్వూరు: గోష్పాదక్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. శనివారం తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా కొవ్వూరు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి సుందరేశ్వరస్వామి దర్శించుకున్నా రు.స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సుమారు లక్షమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని అంచనా వేస్తున్నారు.

పిఠాపురం : పాదగయ కుక్కుటేశ్వరస్వామి ఆలయంలో పాదగయ పుష్కరిణిలో సుమారు 4 లక్షల మంది పుణ్య స్నానాలాచరించినట్లు అంచనా. శుక్రవారం అర్ధ రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు భక్తుల తాకిడి కొనసాగింది. వేలాది మంది శనిత్రయోదశి పూజలు నిర్వహించారు.



రాజమహేంద్రవరంలోని శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి రథోత్సవం



పుష్కరాలరేవు వద్ద పితృదేవతలకు దానాలు ఇస్తున్న భక్తులు



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు

న్యూస్‌రీల్

గోదావరిలో యువకుడు గల్లంతు

కొవ్వూరు: మద్దూరులంక సమీపంలో చాగల్లు మండలానికి చెందిన దేవరకొండ శ్రీరామ్ (19)అనే యువకుడు గోదావరిలో గల్లంతయ్యాడు. చాగల్లు మండలం చంద్రవరం గ్రామానికి చెందిన శ్రీరామ్ తన స్నేహితులు ఎస్‌కే బషీర్, మలకా ధనరాజులతో కలిసి శుక్రవారం ఉదయం మద్దూరు లంక గోదావరి బ్రిడ్జి వద్దకి వెళ్లాడు. బహిర్భూమి వెళ్లి వస్తానని చెప్పి శ్రీరామ్ బ్రిడ్జి దిగువకు వెళ్లినట్లు అతని మిత్రులు చెప్పారు. ఎంతకీ రాకపోవడంతో స్నేహితులు వెళ్లి చూశారు. నది ఒడ్డున షర్టు,సెల్‌ఫోన్ ,చెప్పులు కనిపించాయి. ఎంత వెతికినా శ్రీరామ్ ఆచూకీ లభ్యం కాలేదు. గోదావరి నదిలో గల్లంతై ఉండవచ్చునని భావిస్తున్నారు. శ్రీరామ్ తల్లి మార్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై సతీష్ దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వేంకటేశ్వరునికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామికి పలువురు భక్తులు శనివారం విరాళాలు అందజేశారు. కొండపల్లి విజయలక్ష్మి (తెలంగాణ రాష్ట్రం పాల్వంచ) రూ.లక్ష, పి.సాయి అంజన శ్రీహిత (హైదరాబాద్ నాగోల్) రూ.25 వేలు, సాయిమోహిత్ రూ.10 వేల చొప్పున సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు ఈ మొత్తాలను అందజేశారు. దాతలకు స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

ఎస్సై పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆదివారం జరగనున్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అభ్యర్థుల రాత పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాల్లో 16,750 మంది అభ్యర్థులకు రెండు పేపర్లతో కూడిన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు

కాకినాడ ఏఎంజీ హైస్కూల్‌లో నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు: డీఈఓ అన్నపూర్ణ

కాకినాడ సిటీ: ఈ నెల 22 నుంచి 23 వరకు జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన కాకినాడ డైరీఫారం సమీపంలోని ఏఎంజీ ఇంగ్లిష్‌మీడియం హైస్కూల్‌లో వేదిక కానుంది. జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కెఎస్‌వీఎస్ అన్నపూర్ణ శనివారం మీడియాకు తెలిపారు. పాఠశాల విద్యా కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ కృతికా శుక్లా మార్గదర్శకత్వంలో ఈ విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి దశలో గత ఏడాది నవంబర్ 28న 170 ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు అంశాల్లో పాఠశాల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించామన్నారు. ప్రతి అంశం నుంచి ఒక్కొక్క అత్యుత్తమ ప్రాజెక్టు ఎంపిక చేశామన్నారు. ఎకో-ఫ్రెండ్లీ మెటీరియల్, హెల్త్ అండ్ క్లీన్లీనెస్, సాఫ్ట్‌వేర్ అండ్ ఏపీపీఎస్, ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ ఛేంజెస్, మేథమెటికల్ మోడలింగ్, రెండవ దశలో డిసెంబర్ 28న మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 21 మండలాల్లో నిర్వహించామన్నారు. మూడవ దశలో పై ఐదు ఉప అంశాలలో మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన సుమారు 105 ప్రాజెక్టులను తాజాగా నిర్వహించే జిల్లా స్థాయి వైద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శిస్తారని డీఈవో వివరించారు. నాలుగో దశ కింద జిల్లా స్థాయిలో ప్రతి ఉప అంశం నుంచి ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం పొందిన ప్రాజెక్టులు ఈనెల 28న జరగనున్న రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించేందుకు అర్హత పొందుతాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మక నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఎగ్జిబిషన్లు దోహదపడతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సైన్స్ అభిమానులు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని డీఈవో కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌వినీల్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల తాకిడి



సత్యదేవుని ఆలయం వద్ద స్వామివారి దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రత్నగిరి సత్యదేవుని ఆలయానికి సుమారు 40 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రతమండపాలు, విశ్రాంతి మండపాలు, క్యూ లైన్లు అన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి దర్శనానికి అనుమతించారు. సాధారణ దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

‘ప్రయోగం’ ఫలించాలి

- రేపటి నుంచి ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు
- 26 నుంచి జనరల్ ప్రాక్టికల్స్
- విద్యార్థులకు నాన్ జంబ్లింగ్, అధ్యాపకులకు జంబ్లింగ్



రాయవరం: ఇంటర్మీడియెట్ ఒకేషనల్ ప్రయోగ (ప్రాక్టికల్) పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నాన్ జంబ్లింగ్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. థియరీ పరీక్షల్లో మాత్రం జంబ్లింగ్ విధానం అమలు చేయనున్నారు. ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతున్న ప్రయోగ పరీక్షలు మార్చి 7వ తేదీ వరకు జరగనున్నాయి. ఫస్టియర్, సెకండియర్ ఒకేషనల్ విద్యార్థులు 10,200 మంది, సెకండియర్ జనరల్ విద్యార్థులు 42,087 మంది ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. సెకండియర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు మాత్రమే ఈ నెల 26 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్స్ నిర్వహణకు ఒకేషనల్ విద్యార్థులకు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు నాన్ జంబ్లింగ్ అమలు చేస్తుండగా, అధ్యాపకులకు మాత్రం జంబ్లింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఒక కళాశాలలో ఎగ్జామినర్‌గా విధులు నిర్వర్తించిన వారికి రెండో రోజు ఏ కళాశాలకు వెళ్లాలన్న సమాచారాన్ని అధికారులు గంట ముందు మాత్రమే ఇస్తారు. తద్వారా అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రం

పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లాగిన్‌లో ప్రాక్టికల్ పరీక్షల ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్ష నిర్వహించే అరగంట ముందు మాత్రమే పాస్‌వర్డ్ ద్వారా సైట్ ఓపెన్ చేసి ప్రశ్నపత్రం ప్రింట్ తీసి, దాని జిరాక్స్‌లను విద్యార్థులకు ఇవ్వాల్సి ఉంటుంది. సైట్ ఓపెన్ చేసే సమయంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. అధ్యాపకులకు జంబ్లింగ్, పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రాక్టికల్ పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని జూనియర్ కళాశాలల వివరాలు

ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు :	161
ప్రైవేటు జూనియర్ కళాశాలలు :	307
మొత్తం విద్యార్థులు :	1,01,535
ఫస్టియర్ విద్యార్థులు :	47,442
సెకండియర్ విద్యార్థులు :	52,993
ఒకేషనల్ ఫస్టియర్:	5,079
ఒకేషనల్ సెకండియర్:	5,121

ఏర్పాట్లు పూర్తి



ప్రాక్టికల్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. విద్యార్థులు ఎటువంటి అసౌకర్యానికి, ఒత్తిడికి గురి కాకుండా అవగాహన కల్పించాం. పరీక్ష నిర్వహణపై ఇన్విజిలేటర్లకు కూడా సూచనలు చేశాం.

– ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, ఆర్ఐఓ, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

కొనసాగుతున్న జాతీయ హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం కూడా కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో గోయన్స్ జట్టుపై కర్ణాటక 9–0 స్కోర్ తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌పై 12–0 స్కోర్‌తో జార్ఖండ్ విజయ కేతనం ఎగురవేసింది. బిహార్‌పై హర్యానా జట్టు మూడో మ్యాచ్‌లో 9–0 స్కోర్ తేడాతో విజయం సొంతం చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో అండమాన్, నికోబార్ జట్టుపై మహారాష్ట్ర 42–0 స్కోర్‌తో విజయం అందుకుంది. శనివారం నిర్వహించిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్‌రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, ట్రెజరర్ పీటర్, టోర్నమెంట్ కో ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్ర సింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.

అంతర్జాతీయ ప్రదర్శనకు కాకినాడ నర్తకులు



ఆహ్వానం అందుకున్న నర్తకీమణుల బృందం

కాకినాడ కల్చరల్: తమిళనాడులోని బృహదీశ్వర ఆలయంలో ఈ నెల 20 నుంచి 22 వరకూ నిర్వహించనున్న అంతర్జాతీయ నృత్యోత్సవంలో పాల్గొనడానికి కాకినాడకు చెందిన నాట్యాచార్య డాక్టర్ కృష్ణకుమార్ శిష్యబృందానికి ఆహ్వానం అందింది. ఈ బృందంలో మనస్విని కృతి, గాయత్రి సౌజన్య, గాయత్రి మెహాల్, త్రినయని, తేజస్విని, మల్లిక, ఉమా మహేశ్వరి ఉన్నారు. వీరు శనివారం కాకినాడ నుంచి బయలుదేరారు.

'తనిష్క్'లో వజ్రాభరణాల ప్రదర్శన



ప్రదర్శనలో వజ్రాభరణాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని తనిష్క్ షోరూములో మొట్టమొదటిసారిగా వజ్రాభరణాల ప్రదర్శన, అమ్మకాలను అధినేత శ్రీనందన్ గోలి శనివారం ప్రారంభించారు. ఆదివారం వరకూ ఈ ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని ఈ సందర్భంగా చెప్పారు. ఈ ప్రదర్శనలో సుమారు రూ.15 కోట్ల విలువైన వజ్రాభరణాలు ఉంచామని, కొనుగోలుపై 20 శాతం డిస్కౌంట్ ఉంటుందని తెలిపారు. ఒక్కో ఆభరణం విలువ రూ.50 లక్షల వరకూ ఉంటుందని అన్నారు. ప్రదర్శనలో తనిష్క్ కంపెనీ ప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలలు చెదిరి.. కన్నీరే మిగిలి..

- పట్టిసం ప్రమాదంతో దోసకాయలపల్లిలో విషాదం
- గోదావరిలో మునిగి ముగ్గురు యువకుల దుర్మరణం
- కంటికి కడివెడుగా రోదిస్తున్న కుటుంబ సభ్యులు







ఓలేటి అరవింద్, షేక్ లుక్మన్, పెద్దిరెడ్డి రాంప్రసాద్ మృతదేహాలు

మధురపూడి/రాజానగరం: ఇంజినీర్ అయి కుటుంబాన్ని బాగా చూసుకోవాలని ఒకరు.. వ్యాపారంలో తండ్రికి తోడుగా ఉండాలని మరొకరు.. బాగా చదువుకుని కుటుంబానికి అండగా ఉండాలని ఇంకొకరు కలలు కన్నారు. అవి తీరకుండానే.. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చి.. ఆ యువకులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. మహాశివరాత్రి పర్వదినాన ఏలూరు జిల్లా పట్టిసం పుణ్యక్షేత్రం వద్ద గోదావరిలో జరిగిన ఘోరం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. చేతికి అందివస్తారనుకున్న బిడ్డల బతుకులు అర్ధాంతరంగా గోదారి పాలవడంతో గుండెలు పగిలిన ఆ తల్లిదండ్రులు కంటికి కడివెడుగా రోదిస్తున్నారు.

కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామానికి చెందిన స్నేహితులైన ఏడుగురు యువకులు మహాశివరాత్రి సందర్భంగా పట్టిసం పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. అక్కడ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, భద్రకాళీ సమేత వీరభద్ర స్వామిని దర్శించుకుని, ఉత్సవాల్లో సరదాగా గడిపి తిరిగి వద్దామని అనుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట దాటిన తరువాత నదిలో స్నానానికి దిగారు. అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాల వద్ద కాకుండా బారికేడ్‌లు, హెచ్చరిక బోర్డులు లేని మరో ప్రదేశంలో స్నానానికి దిగారు. దీంతో అక్కడ నది లోతు ఎంతుందో వారికి తెలియలేదు. ఈ క్రమంలో ఎస్‌కే లుక్మన్ (19), ఓలేటి అరవింద్ (20), పెదిరెడ్డి రాంప్రసాద్ (18) గల్లంతయ్యారు. మిగిలిన నలుగురు మిత్రులూ ఇచ్చిన సమాచారంతో పోలవరం పోలీసులు హుటాహుటిన స్పీడ్ బోట్లలో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే ముగ్గురి మృతదేహాలనూ వెలికితీశారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ హుటాహుటిన అక్కడకు బయలుదేరారు. ఉత్సవాలకు వచ్చిన తమ పిల్లలు క్షేమంగా తిరిగి వస్తారనుకుంటే, అర్ధాంతరంగా తమను వదిలి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారంటూ పెద్ద పెట్టున విలపించారు. చేతికి అంది వచ్చిన కొడుకులను పోగొట్టుకున్న ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.



స్పీడ్ బోట్‌లతో గాలింపు చర్యలు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది



సంఘటన స్థలంలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఇంజినీర్‌నై బాగా చూసుకుంటానన్నావు

'ఇంజినీర్‌నై బాగా చూసుకుంటానమ్మా అన్నావు. నిన్ను చూసుకునే బతుకుతున్నాను. నువ్వు కూడా ఇలా దూరమైపోతే నేనెందుకు బతకాలి?' అంటూ మృతుడు లుక్మన్ తల్లి షేక్ ఆశ తలను నేలకు బాదుకుంటూ రోదిస్తుంటే చూపరుల హృదయాలు చలించిపోయాయి. ఆశ, శ్రీను దంపతులకు లుక్మన్ ఒక్కడే సంతానం. తల్లిదండ్రులిద్దరూ కూలీ చేసుకుంటూ కొడుకును పాలిటెక్నిక్ ఫస్టియర్ చదివిస్తున్నారు. తన చదువు కోసం తల్లి పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోయిన లుక్మన్, ఇంజినీర్‌నై బాగా చూసుకుంటానని తల్లితో తరచూ అంటుండేవాడు. అతడు స్నేహితులతో కలిసి పట్టిసం వెళ్తానంటే వద్దని తల్లి వారించింది. 'అయినా వినకుండా ఇలా దూరమైపోయవా' అంటూ ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వీరి ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే. దీంతో ఇరుగుపొరుగు వారిని అడిగి పట్టిసం వెళ్తానన్న లుక్మన్‌కు తల్లి ఆశ రూ.100 ఇచ్చింది. చివరకు కడచూపు చూసుకునేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో అక్కడా ఇక్కడా డబ్బులు సమకూర్చుకుని వారు కాస్త ఆలస్యంగా వెళ్లడం పలువురిని కలచివేసింది.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దిగ్భ్రాంతి

పట్టిసం ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దిగ్భ్రాంతి చెందారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులను అప్రమత్తం చేశారు. సహాయక చర్యల కోసం కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావును, నాయకుడు కొండపల్లి దుర్గారావును సంఘటన స్థలానికి పంపించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అండగా ఉంటానని.. అర్ధాంతరంగా వెళ్లిపోయి..

ఈ సంఘటనలో మరో మృతుడు ఓలేటి అరవింద్ తండ్రి సూర్యనారాయణ భవన నిర్మాణ కార్మికుడు. అతడి పెద్ద కొడుకు తండ్రితో పాటే భవన నిర్మాణ పనులు చేస్తుంటాడు. రెండో కొడుకు అరవింద్ దోసకాయలపల్లిలోనే బేకరీ నిర్వహిస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. హైస్కూల్ స్థాయిలోనే చదువుకు స్వస్తి చెప్పిన అతడు, వ్యాపారం చేసుకుంటానంటే అప్పు చేసి రెండేళ్ల క్రితం బేకరీ పెట్టించారు. వ్యాపారం చేసుకుంటూ అండగా ఉంటాడనుకున్న కొడుకు ఇలా తనువు చాలించడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

ఒక్కగానొక్క కొడుకూ దూరమై..

పట్టిసం ఘటనలో ఇంకో మృతుడు పెద్దిరెడ్డి రాంప్రసాద్ రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. ఇతడికి పెళ్లీడుకొచ్చిన చెల్లెలు ఉంది. ఆమెకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తండ్రి దుర్గారావు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో ఉన్న ఒక్కగానొక్క కొడుకూ ఉన్నత చదువులు చదివి, కుటుంబానికి అండగా నిలబడతాడనుకుంటే ఇలా దూరమైపోయాడంటూ ఆ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు అందరినీ కంట తడి పెట్టించింది.

దారిదోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

- సెల్‌ఫోన్, బంగారు చైన్ స్వాధీనం
- ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఒక వ్యక్తిని కత్తులతో భయపెట్టి బంగారు గొలుసు, ఫోన్ దోపిడీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం దిశ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. సీతానగరం మండలం ఉండేశ్వరపురానికి చెందిన వైదే వెంకన్నబాబు దానవాయిపేటలోని ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలో బంగారపు తనిఖీదారుగా పని చేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి విధులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. కాతేరు గామన్ బ్రిడ్జి దాటిన తరువాత ఎస్సార్ పెట్రోలు బంకు ఎదుట ఉన్న ఖాళీ స్థలం వద్ద కాలకృత్యాల కోసం ఆగాడు. ఈలోగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజారకు చెందిన బత్తుల మరేశ్వరరావు (మరేష్), రాజమహేంద్రవరం కోటిలింగాలపేటకు చెందిన తురక కొండలరావు అతడి వద్దకు వచ్చి, కత్తులతో భయపెట్టారు. వెంకన్నబాబు మెడలోని బంగారు గొలుసు, మొబైల్ ఫోన్ లాక్కుని గాయపరచి, పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా వచ్చిన సమాచారం మేరకు కోటిలింగాల ఘాట్ వద్ద నిందితులు మరేష్, కొండలరావులను అరెస్టు చేశారు. వారి నుంచి 9 గ్రాముల బంగారు గొలుసు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను త్వరితగతిన అరెస్టు చేసి, సొత్తు రికవరీ చేసిన త్రీటౌన్ ఎస్సై శ్యామ్‌సుందర్‌ను, కానిస్టేబుళ్లు వెంకట్, చక్రధర్, విజయ్‌లను ఎస్పీ అభినందించి, రివార్డులు ప్రకటించారు. విలేకర్ల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ సంతోష్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు కూడా పాల్గొన్నారు.



నిందితులను అరెస్టు చేసిన పోలీసు సిబ్బందితో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- నిందితులెంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు
- బాలికకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

కాట్రేనికోన: మండలంలోని చిర్ర యానాం గ్రామంలో సామూహిక లైంగిక దాడికి గురైన బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. చిర్రయానాం గ్రామానికి శనివారం రాత్రి వెళ్లిన ఆయన.. బాధిత బాలిక, ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అత్యాచార నిందితులెంతటి వారైనప్పటికీ దిశ చట్టం ద్వారా కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఇప్పటికే పోలీసులు నిందితులపై కఠినమైన సెక్షన్లతో కేసు నమోదు చేశారని చెప్పారు. నిందితులను కోర్టుకు కూడా తరలించారని తెలిపారు. బాధిత బాలికకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నామని పొన్నాడ ప్రకటించారు. ఈ విషయాన్ని ఆ బాలిక కుటుంబీకులకు తెలియజేశారు. ఈ దారుణ ఘటనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకు వెళ్లానని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి జగన్ భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ దురదృష్టకర ఘటనను ప్రతిపక్ష నేతలు రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం బాధాకరమని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీపై అభాండాలు తగవు

బాలికపై లైంగిక దాడి ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులపై బురద జల్లుతూ మీడియాలో వస్తున్న వార్తలను చిర్రయానాం సర్పంచ్ భర్త ఓలేటి నాగేశ్వరరావు ఖండించారు. పోలీసులకు ఫిర్యాదు చేయకుండా బాలిక తండ్రిని వైఎస్సార్ సీపీ నాయకులు బెదిరించారనే ఆరోపణను ఆయన ఖండించారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికే బాలికను అభాసుపాలు చేశారని, ఈ ఘటనతో ఎమ్మెల్యేకు, పార్టీకి సంబంధం లేకున్నా బురద జల్లడం తగదు నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

గోదావరిలో పడి బాలుడి మృతి

కె.గంగవరం: గౌతమీ గోదావరిలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మహాశివరాత్రి సందర్భంగా అద్దంపల్లికి చెందిన పంపన సత్య వీరేంద్ర (14) స్నేహితులతో కలసి కోట వద్ద గౌతమీ గోదావరి నదికి స్నానానికి వెళ్లాడు. నదిలో ఈదుతున్న క్రమంలో వీరేంద్ర, అతడి మిత్రుడు మేడిశెట్టి మణికంఠ గోదావరిలో మునిగిపోయారు. వారిని రక్షించేందుకు మిగిలిన స్నేహితులు ప్రయత్నించారు. అప్పటికే సత్య వీరేంద్ర మృతి చెందాడు. మణికంఠ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. అతడు ప్రస్తుతం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వీరేంద్ర అద్దంపల్లిలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అతడి మృతితో ఆ గ్రామంలో విషాదం అలముకుంది.

మహిళ ఆత్మహత్య

కడియం: కడియపుసావరం గ్రామానికి చెందిన మహిళ జి.వీరనాగమణి (38) చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కడియం పోలీసుల కథనం ప్రకారం.. కుటుంబ తగాదాల నేపథ్యంలో మనస్తాపం చెందిన వీరనాగమణి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. వెంటనే బంధువులు, చుట్టుపక్కల వారు ఆమెను కడియం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. భర్త గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు మునిగి పోయాడంటూ హడావుడి

- పాదగయ పుష్కరిణి వద్ద మహిళ గగ్గోలు
- పరుగులు తీసిన అధికారులు, పోలీసులు
- తీరా చూస్తే ఇంటివద్దనే ఉన్న బాలుడు

పిఠాపురం: పుష్కరిణిలో తన కొడుకు మునిగిపోయాడంటూ ఓ మహిళ చేసిన హడావుడి అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించింది. తీరా చూస్తే ఆ బాలుడు ఇంటి వద్దనే హాయిగా పడుకున్నాడని గుర్తించి అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగిన ఈ ఘటన వివరాలివీ.. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించేందుకు పట్టణంలోని జగ్గయ్య చెరువు కాలనీకి చెందిన రామలక్ష్మి తన నలుగురు పిల్లలతో కలిసి శనివారం ఉదయం పాదగయ క్షేత్రానికి వచ్చింది. అప్పటికే క్షేత్రంలో విపరీతమైన రద్దీ ఉంది. రామలక్ష్మి, పిల్లలు ఎవరికి వారు స్నానాలు చేశారు. ఆమె పుణ్యస్నానం ఆచరించి బయటకు వచ్చి చూడగా ముగ్గురు పిల్లలు మాత్రమే కనిపించారు. మరో కొడుకు కనిపించకపోవడంతో అతడు పుష్కరిణిలో గల్లంతై ఉంటాడనే ఆందోళనకు గురైంది. తన కొడుకు పుష్కరిణిలో గల్లంతయ్యాడంటూ భయంతో పెద్ద పెట్టున కేకలు వేసింది. దీంతో పాదగయ అధికారులతో పాటు అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులు పరుగులు తీశారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తన సిబ్బందితో హుటాహుటిన పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. బాలుడి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో వెతకడం ప్రారంభించారు. గంట పాటు వెతికినా ఎక్కడా ఆ బాలుడి ఆచూకీ దొరకలేదు. ఇంతలో తప్పిపోయాడని భావిస్తున్న బాలుడు రామలక్ష్మి ఇంటి వద్దనే పడుకుని ఉన్నట్లు స్థానికులు చెప్పారు. తల్లితో పాటు కొంత దూరం వచ్చిన తాను.. ఆమెకు చెప్పకుండా తిరిగి ఇంటికి వెళ్లిపోయి నిద్రపోయానని ఆ బాలుడు చెప్పాడు. దీంతో అందరూ కాసేపు అవాక్కయ్యారు. ఆ బాలుడు క్షేమంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు.